# ఇంటర్‌వ్యూ



రేడియో స్టేషన్ ఆవరణంతా చాలా హడావుడిగా ఉంది. ఇంటర్‌వ్యూ కొచ్చిన అభ్యర్థులందరూ బయట విజిటర్స్ రూములో కూర్చుని ఇంటర్‌వ్యూ గురించి ఏవేవో విషయాలు చర్చించుకుంటున్నారు.

'ఇంటర్ వ్యూ' ప్రారంభమయింది.

మొదటి అభ్యర్థిని లోపలకు పిలిచి చెడామడా ప్రశ్నించి, బెదరగొట్టి ఫెయిల్ చేసిపారేసారు అధికారులు.

సరిగ్గా అప్పుడే ఢిల్లీ నుంచి డైరెక్టు డయలింగ్ చేశారెవరో.

"హలో! డిప్యూటీ మినిస్టర్ అభ్యర్థి ఒకతను ఇంటర్‌వ్యూకి వచ్చాడు. ఎలాగయినా సరే, అతనిని సెలక్ట్ చేయాలి! పేరు రాసుకోండి!"

స్టేషన్ డైరెక్టర్ గారు హడావుడిగా కాగితం, పెన్నూ అందుకున్నారు.

"చెప్పండి!"

"కె.శ్రీనివాసన్, సన్ ఆఫ్ కె. రామనాథన్."

"రాసుకున్నానండీ! కానీ కాంపిటీషన్ చాలా స్టిఫ్‌గా ఉందండీ! రెడువందలమంది అర్హతలున్న వారు ఇంటర్‌వ్యూ కొచ్చారు."

"మరేం ఫరావాలేదు. అందరినీ రేడియోస్టేషన్ ఇంటర్నల్ వర్కింగ్ గురించీ, ప్రొసీజర్స్ గురించీ అడగండి! ఒక్కడూ సమాధానం చెప్పలేడు. ఆ విధంగా మావాడిని ఈజీగా లాగేయవచ్చు."

"అలాగే సార్!"

"అన్నట్లు మీరు ట్రాన్స్‌ఫరుకి పెట్టుకున్న ఆప్లికేషన్ ఇప్పుడే పెద్దసార్‌కి పుటప్ చేస్తున్నాను ఒక వారంలో ఓ.కే. చేస్తాము."

"థాంక్యూ సర్!"

"నెక్స్ట్ కాండిడేట్‌ని పిలవొచ్చా సార్!" అడిగాడు ప్యూను.

"అప్పుడే వద్దు! కొంచెం సేపాగు?" అన్నాడు ఎస్.డి.

ప్యూన్ బయటికెళ్ళిపోయాడు.

"ఇదిగో ఈ శ్రీనివాసన్ అనే అభ్యర్థిని మనం ఈ పోస్టుకి ఇంటర్‌వ్యూలో సెలక్ట్ చేయాలని ఢిల్లీ ఇన్‌స్ట్రక్షన్స్! కనుక మనం చేయాల్సిందేమిటంటే అభ్యర్థుల కెపాసిటీని టెస్టు చేయటం కాదు. ఎలాగోలా వాళ్ళను సెలక్ట్ కాకుండా చూడడం! అందుకోసం మన రేడియో స్టేషన్‌లో ఇంటర్నల్ వర్కింగ్ గురించి ప్రశ్నిస్తే మంచిది! సెంట్ పర్సెంట్ కాండిడేట్స్‌ని ఎవైడ్ చేసేయవచ్చు. ఏమంటారు?"

మిగతా అందరూ నవ్వారు.

"మీ ఇష్టం! మాదేమంది! మీరెలా చెపితే అలా?"

"నెక్స్ కాండిడేట్" అంటూ బెల్ నొక్కాడు ఎస్.డి. మరో రెండుగంటల్లో అభ్యర్థులంతా విచారంగా ఆ ఆవరణ వదలి వెళ్ళిపోయారు.

"ఇంక ఒకే ఒక్క అభ్యర్థి మిగిలాడు. అతని తరువాత ఇంక ఉండేది ఆ రికమండేషన్ కాండేటే! గనుక ఇప్పుడొచ్చేవాడొక్కడినీ ఫెయిల్ చేసి పారేస్తే- ఇంక ఆ శ్రీనివాసన్ ఆటోమేటిగ్గాసెలక్టయి పోయినట్లే!" అన్నాడు ఎస్.డి.

"ఇంతమందిని తెల్లముఖం వేయించగా లేనిది ఇంక ఈ ఒక్కడేం సమస్య ఉందిలెండి! రానీండి." నవ్వుతూ అన్నాడు ప్రక్కతను. మరుక్షణంలో శ్రోతేస్వరావ్ చిరునవ్వుతో లోపలి కడుగుపెట్టాడు.

"గుడ్‌మాణింగ్ సర్స్" అన్నాడు చిరునవ్వుతో.

"గుడ్‌మాణింగ్! టేక్ యువర్ సీట్!" అన్నాడు ఎస్.డి.

అతను కూచుని అందరివంకా ఓసారి చూశాడు.

"మీ పేరు శ్రోతేశ్వరావుకదూ?" అడిగాడు ఒకతను.

"అవునండీ!"

"తమాషాగా ఉందే పేరు?"

"అవునండీ చాలా తమాషా పేరు! పేరు పెట్టటం కూడా చాలా తమాషాగానే జరిగిందండీ! నేను పుట్టిన దగ్గర్నుంచీ రేడియో ప్రోగ్రామ్స్ అంటే చాలు- చెవులు రిక్కించుకుని వినేవాడినటండీ! ఎంత ఏడుస్తున్నా గానీ నా చెవిదగ్గర రేడియో పెడితే చాలు ఠక్కున ఏడుపు మానేసేవాడినంటండీ! అందుకనే మావాళ్ళు శ్రోతేస్వర్రావ్ అని పేరు పెట్టారండి!"

"వెరీగుడ్! బావుంది! అయితే మీరు చిన్నప్పటి నుంచి రేడియో తాలూకు ఉత్తమ శ్రోతకదా! అందుకని రేడియోకి సంబంధించిన ప్రశ్నలే అడుగుతాము. జవాబు చెప్పండి."

"ఓ! విత్ ప్లెజర్!"

"మీరు కార్మికుల కార్యక్రమం ప్రోగ్రాం కోసం ఎవరయినా కార్మికుడిని ఇంటర్వ్యూ చేయడాని కెళ్తారనుకోండి- ఎలా చేస్తారు?"

"రికార్డింగ్ ఎక్విప్‌మెంట్‌తో ఫ్యాక్టరీ కెళ్ళిపోతానండి. అక్కడ మేనేజర్‌తో మాట్లాడి, కార్మికులందరిలోకీ అతి తెలివి తక్కువ వాజమ్మ, మాట్లాడడం రాని దద్దమ్మ ఎవడో తెలుసుకుని అతనితో ఇంటర్వ్యూ ప్రారంభిస్తామన్న మాటండి- వాడు గవర్నమెంట్‌కి గానీ, ఫాక్టరీ యాజమాన్యానికి గానీ వ్యతిరేకంగా మాట్లడడానికి వీల్లేదని ముందే వార్నింగ్ ఇస్తామండీ! ఇంటర్వ్యూ ఇలా ఉంటుందండీ-

"ఆ! నీ పేరేమిటి బాబూ!"

"యాదగిరండి."

"ఆ- చూడు రాములూ నువ్వీ ఫ్యాక్టరీలో చేరి ఎంతకాలమైంది?"

"ఇరవై సంవత్సరాలయిందండి."

"చేరినప్పుడు నీ జీతం ఎంత?"

"ఎంతండీ? రెండొందల పాతిక."

"మరిప్పుడు?"

"ఇప్పుడు ఆరొందలండి."

"ఆరొందలే. అబ్బా, అంటే మూడింతలు పెంచారన్నమాట- మీ ఫ్యాక్టరీ యాజమాన్యం వారు. ఎందుకంటే వారికి కార్మికులు శ్రేయస్సే ప్రధానం కాబట్టి పెంచారు - సరే! ఆ! చూడు రత్తయ్యా నీకెంతమంది పిల్లలు?"

"మొదటి భార్యకి ఇద్దరు- రెండో.."

"ఓహో ఇద్దరే పిల్లలన్నమాట. అంటే దేశ క్షేమం, నీ కుటుంబ సంక్షేమం కోసం నువ్వు ఇద్దరి పిల్లల్ని కన్నాక కుటుంబ నియంత్రణ అమలు పరుస్తున్నావు కదూ?"

"అబ్బే కాదండీ- ఇంకా నా ఇద్దరు పెళ్ళాలూ పిల్లల్ని కంటూనే ఉన్నారండీ! మొదటి పెళ్ళానికి ఆరుగురు- రెండోదానికి ఎనిమిదిమందీ" (ఇది రికార్డు అయిన

తరువాత చెరిపేస్తాం)

"బావుంది వెంకయ్యా! మనదేశంలో ప్రతికార్మికుడూ కూడా నీలాగా కుటుంబ నియంత్రణ పాటిస్తే ఎంతోమేలు కలుగుతుంది దేశానికి. మరి మీ పిల్లలు ఏం చదువుతున్నారు?"

''పెద్దది ఆరు సదివి అంట్లు తోముతుంది. రెండోవాడురెండు చదివి అడుక్కుతింటున్నాడు. మూడోది ఇంట్లో నుంచి పారిపోయింది. నాలుగోవాడు (ఇదంతా ఎడిట్ చేసేస్తాం)

"ఒహో పెద్దమ్మాయి ఆరోక్లాసన్న మాట. అంటే రెండోవాడుఅయిదోక్లాస్ అవాలి! కదూ, బావుంది మరి నీకొచ్చే జీతం శుభ్రంగా సరిపోతుంది కదూ."

"ఎక్కడండీ నెలకు రెండొందలు అప్పు... (అప్పు అనే మాట చెరిపేస్తాం.)

"ఒహో నెలకు రెండొదలు మిగులుతుందన్నమాట. బావుంది. ఆ డబ్బు మరి ప్రభుత్వ బాంకుల్లో దాచుకుంటావన్న మాట. అలా ప్రతి నెలా డబ్బ దాచుకుని కూతురి పెళ్ళికో, కొడుకు ఇంజనీరింగ్ చదువుకో ఉపయోగిస్తావ్ అంతేగా.

బావుంది. ఇకపోతే మీ ఫాక్టరీలో ఏదయినా ప్రమాదం జరిగి ఎవరికయినా గాయాలు తగిల్తే యాజమాన్యం ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తారు?"

"దొంగ బాడుకవ్‌లు. ఆళ్ళేం సౌకర్యాలిస్తుంర్రు సార్? మొన్నటికి మొన్న రాజయ్య చేయి మిషన్‌లో పడి విరుగుతే వాడిని ముప్పయ్ తిప్పలుపెట్టి మూడు చెరువుల నీళు ళ్ళ తాగించి– చివరకు రెండొందలు ఆడి మొకాన కొట్టిర్రు సార్. అట్లనే రమణయ్య..."

(ఇదంతా రికార్డు చేయమండీ అసలు– చేసినట్లు వాడిన నమ్మిస్తాం)

"మాట్లాడవేం రాములూ ఎవరికయినా గాయాలు తగిల్తే నష్ట పరిహారం ఇవ్వటం, కుటుంబాన్ని ఆదుకోవటం, ఇవికాక ఇంకా చాలా సౌకర్యాలు కలుగజేస్తారన్నమాట! వెంకటయ్యా! చాలా సంతోషంగా ఉంది. నీ దగ్గర ఇన్ని అద్భుతమయిన విషయాలు తెలుసుకున్నందుకు, నమస్కారం."

"దణ్ణం బాబూ."

''ఇదండీ ఇలా చేస్తాను కార్మికుడితో ఇంటర్‌వ్యూ'' అంటూ ముగించాడు శ్రోతేశ్వరరావు.

ఇంటర్‌వ్యూ చేసే ముగ్గురూ మొహమొహాలు చూసుకున్నారు. అతను చెప్పిన సమాధానం సెంట్‌పర్సెంట్ కరెక్ట్. కనుక అందులో అతనిని ఫెయిల్ చేయడం కుదరదు.

"మిస్టర్ శ్రోతేశ్వర్రావ్! బలహీనవర్గం తాలూకు వ్యక్తిని ఇంటర్‌వ్యూ చేయాలి. ఎలా చేస్తావ్?"

శ్రోతేశ్వర్రావు చిరునవ్వు నవ్వాడు–

"అబ్బ! చాలా ఈజీ కొశ్చెన్‌సార్! నాకు ఇది నిజంగా బై హార్ట్ అయిపోయింది. ఇదిగో ఇలా ఉంటుందండీ నా ఇంటర్‌వ్యూ-

"ఆ నీ పేరేంటమ్మా!"

"ఈరమ్మండీ."

"ఆ చూడు ఈరమ్మా, నీకు పెళ్ళయింద?"

"అదేటి బాబూ! నలుగురు పిల్లలు."

"అలాగా నీ భర్త ఏం చేస్తుంటాడు?"

"కల్లు గీత్తుంటాడండీ."

"ఓహో! నీరా కార్మికుడన్న మాట. ఆ, చూడు! ఈరమ్మా మీఇంటిముందు కోళ్ళున్నట్టున్నాయి అవెక్కడివి?"

"ఆళ్ళెవళ్ళో బాంకోళ్ళట బాబూ, కోళ్ళ పెంచటానికి రెండొందలు అప్పు..."

"ఓహో గ్రామీణ బాంకీవాళ్ళు మీకు పౌల్ట్రీఫారం ఏర్పాటు చేసుకోడానిక గాను పెద్ద ఎత్తున ఆర్థిక సహాయం చేశారన్న మాట. మరి ఈ కోళ్ళఫారం వల్ల మీకెంత ఆదాయం వస్తుంది?"

"ఏడబాబూ! ఆ ఎనిమిది కోళ్ళల్లో ఆరు పుంజులే తగలడ్డాయి. ఇక గుడ్లేడ కెళ్ళి వత్తాయ్?"

"ఓహో కోళ్ళను పెంచి పెద్దచేసి అమ్మే పద్ధతి వల్ల ఇంకా బాగా లాభాలు వస్తున్నాయన్న మాట. మరి మీ పిల్లలేం చదువుతున్నారు ఈరమ్మా?"

"చదువులేటండీ- పెద్దది గొడ్లుకాస్తది. రెండోవాడు ఆయనతో పాటు కల్లు తీస్తనికెళు తుండె. మూడోది పేడేరుకొచ్చి పిడకలు చేస్తది నాలుగోది.."

(ఇదంతా రికార్డ్ అవదులెంది. అయినా చెరిపేస్తాం)

"అయినా మాకు సదువు లేటండీ-"

"అదే అడుగుతున్నా! అయితే అందరూ ప్రభుత్వ హాస్టల్స్‌లో ఉంటూ, పాఠశాలల్లో ఉచిత విద్య చక్కగా అభ్యసిస్తున్నారన్నమాట. మరి వాళ్ళందరికీ ఉచిత పాఠ్య పుస్తకాలూ, నోట్ పుస్తకాలూ, స్కాలర్‌షిప్‌లూ ఇస్తున్నారు కదూ?"

"సదువే లేదంటే అలా అంటారేటి బాబూ" (రికార్డు అవదు)

"మీరుంటున్న ఇల్లు బాగుంది ఈరమ్మా! ఇది బలహీనవర్గాల కోసం ప్రభుత్వం ఉచితంగా ఆరు నెలల క్రితం కట్టించిన కాలనీలో ఇల్లే కదూ?"

'పెభుత్తం కట్టించింది రెండోరోజే కూలిపోనాది బాబూ! మా డబ్బుతో కష్టం చేసి మేమే కట్టుకున్నాం మళ్ళీ." (ఈ సమాధానం చెరిపేస్తాం)

"అక్కడ మేస్తున్న ఆవులెవరివి? మీవేనా? ప్రభుత్వ బాంక్‌లు ఇచ్చిన రుణాలతోనే

కొన్నారు కదూ వాటిని!"

"అవి ఆవులు కాదు బాబూ! ఎద్దులు. అవి ఎవరివీ కావు. ఊరెమ్మట తిరిగే ఎద్దులు-" (చెరిపేస్తాం)

"మరి నువ్వు కూడా ఏదయినా పని చేసుంతావా ఈరమ్మా?"

"పొద్దుటేళ నుంచీ సాయింతరం వరకూ ఆ కొండల్లో తిరిగి కట్టెలు ఏరుకొత్తానండీ!"

"మరి సాయత్రం ఏం చేస్తారు?"

"అందరం కలిసి కూకుని తాగుతామండీ."(చెరిపేస్తాం)

"ఓహెూ! ఓహెూ సాయంత్రాల్లో ప్రభుత్వం మీకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వయోజన విద్యాకేంద్రానికి వెళ్ళి చదువు నేర్చుకుంటారన్నమాట! చాలా సంతోషం! మరి ఆ తర్వాత?

"ఆ తరువాత కూడు తిని తొంగుంటాం-"

"అంటే ప్రభుత్వం చేసిన ఈ సహాయాల వల్ల మీ కుటుంబం యాలత్తూ సుఖంగా జీవితం గడుపుతూ సంఘంలో పైకి రాగలుగుతున్నారన్నమాట. చాల సంతోషం ఈరమ్మా! ఇంక శెలవు తీసుకుంటాం మేము."

"ఇదండీ బహీనవర్గాల వారితో ఇంటర్వ్యూ" అంటూ ముగించాడు శ్రోతేశ్వర్రావు.

మళ్ళీ ఇంటర్వ్యూలో బోర్డు వాళ్ళు ముగ్గురు ముఖముఖాలు చూచుకున్నారు. నిజంగానే ఆ సమాధానం చూస్తే బైహార్ట్ చేసినట్లే ఉంది.

"ఇంకా ఇంటర్వ్యూల గురించి ప్రశ్నించి లాభం లేదు-" అన్నాడు ఎస్.డి. పక్కనున్నతనితో.

"అది సరే! శ్రోతల ఉత్తరాలకు జవాబుల కార్యక్రమాలు ఎలా నిర్వహిస్తావో, చెప్పు చూద్దాం"

"అవును- ఇష్టమొచ్చినట్లు వేరేవేరు ప్రోగ్రామ్‌లు గురించి అడిగేద్దాం" అన్నాడు పక్కనున్నతను. "అలా అడిగి కన్‌ఫ్యూజ్ చేసేయవచ్చు"

"శ్రోతల ఉత్తరాలకు ప్రోగ్రామ్సనీ, మననీ తిడుతూ, విమర్శిస్తూ వచ్చే ఉత్తరాలను ముందే వేరుచేసి చింపి అవతల పారేస్తామండీ! మన కార్యక్రమాల నన్నిటినీ పొగిడే ఉత్తరాలను చదువుతూ మధ్యమధ్యలో ఒకటో అరో 'ఫలానా ప్రోగ్రాం బాగోలేదు' అన్న వాక్యాలు చదువుతాం."

"ఒకవేళ ఉత్తరాలన్నీ కూడా తిడుతూ వస్తే?"

"ఎప్పుడూ అవే కదండీ ఎక్కువ వచ్చేది. అలాంటప్పుడు జనరంజని పద్ధతి అవలంబిస్తామండి!"

"జనరంజని పద్ధతేమిటి?"

"అదేనండి! చేతికందిన సినిమా రికార్డు వేసి నారాయణఖేడ్ నుంచి షీల, లీల, సుశీల, అవలీల, సుగోల, ఘనాపురం నుంచి శివరామ్, బలరామ్, శ్యామ్, ఇమామ్ అన్న బోగస్ పేర్లు చదువుతాం కదా! ఆ పద్ధతన్న మాటండి."

"సరే, న్యూస్‌రీడర్‌గా ఎలాంటి న్యూస్ ప్రజలకు అందజేస్తావ్?"

"న్యూస్ బులెటిన్స్ అన్నీ తీసుకుని ముందు వాటిలో నుంచి ప్రభుత్వాన్ని విమర్శకు గురిచేసే వార్తలన్నీ సెన్సార్ చేసి అవతల పారేస్తానండీ."

మిగిలినవాటిల్లో మొదటివార్త మన ప్రధానమంత్రి గురించి గానీ, ఒకవేళ అలాంటివేమీ దొరక్కపోతే కేంద్ర మంత్రుల గురించి గాని తీసుకుంటాం. లేదా ఇందిరాగాంధి ఫామిలీ గొప్పతనం గురించి ఇంకో వార్త.

ఆ తర్వాత బలహీన, బడుగు, హరిజన వర్గాల ప్రజలకు ప్రభుత్వం తల పెట్టిన కొత్త సౌకర్యాలు గురించి గానీ, వేదా అదివరకటి విషయేలే పునరుద్ఘాటించడం గాని చేస్తాం.

అప్పుడు దేశంలో ఏవో ఒక మూల జరిగిన కారు ప్రమాదం గురించో, లేక రైలు, బస్సు ప్రమాదాల గురించో చెప్పి మృతులు, గాయపడిన వారి సంఖ్యలు వివరిస్తాం.

ఆ తరువాత అల్లర్లు నగరాల గురించీ, అల్లర్ల విషయంలో కాల్పులలో చనిపోయిన వారి విషయం వదిలేసి పరిస్థితి ప్రశాంతంగా ఉందంటాం. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వోద్యోగులకు మంజూరు చేసిన పది రూపాయల డి.ఏ. గురించి రెండు రోజుల పాటు వార్తల్లో ఊదరగొడతాం.

అయినా ఇక్కడో ముఖ్యమైన విషయం గుర్తుంచు కోవాలి మళ్లీ! అదేంటంటే డి.ఏ. పెరిగినప్పుడల్లా పెరిగే నిత్యావసర ధరల గురించి ఏ పరిస్థితిలోనూ వార్తల్లో చెప్ప కూడదు.

ఆ తరువాత ఎలక్షన్లయ్యాక ఓట్ల లెక్కింపు సమయంలో కేంద్రంలో అధికారంలో వున్న పార్టీ ఓడిపోయినా ఆ విషయం చెప్పకూడదు. ఆ పార్టీ గెలిచినవి ఒకటి రెండు స్థానాలే అయినా– ఆ విషయమే ఊరికే ఊదరగొట్టేయాలి.

ఆఖరులో ఒక వాక్యం దేశంలోని అన్ని ప్రతిపక్ష పార్టీల గురించీ ఉండాలి. లేకపోతే వాళ్ళు పార్లమెంటులో ఊరికే గొడవ చేస్తారండీ!" అంటూ ముగించాడు శ్రోతేశ్వరరావు.

అక్కడున్న వారికి ఏం చేయాలో అర్థం కావటం లేదు. మొత్తం నూట ఎనభయ్ మందినీ రెండు గంటల్లో వదిలించుకోగలిగారు గానీ– ఈ ఒక్క ఘటాన్ని ఫెయిల్ చేసి బయటకు పంపడం చేతగావటం లేదు.

"రేడియోలు ప్రసారం చేసే కథలు, నాటికలు, ఎలాంటివి సెలక్టు చేస్తావు"అడిగాడు రెండో అతను ఆలోచించి మరో అస్త్రం వదుల్తూ.

"అందులో పెద్ద ఇదేముందండీ! కథయినా, నాటికయినా, పాటలయినా, హరికథలయినా, బుర్రకథలయినా- ఏదయినాసరే- ఆరుసూత్రాల పథకంలోని ఏదొక సూత్రం గురించీ, లేదా ఇరవై సూత్రాల గురించి కానీ, (హరిజనుల మీద రాసిన నాటకాలకూ, వెట్టిచాకిరీ నాటకాలకూ ప్రిఫరెన్సిస్తాం) ఉండాలండి- లేకపోతే తీసి అవతలపారేస్తాం."

"మరి ఆ నాటకాలు ఎవరు రాసినవి ప్రసారం చేస్తావ్?"

శ్రోతేస్వరరావు ఆనందంగా అరిచాడు.

"అబ్బ! అబ్బ! యెంత ఈజీ కొశ్చెన్.. చెప్పనాండీ?"

"చెప్పు నాయనా" దిగులుగా అన్నాడు ఎస్.డి.

"ఎక్కువభాగము రచయితలు కానివాళ్ళు, లేదా రచనలు చేయటం నేర్చుకుంటున్న వాళ్ళతో రాయిస్తామండీ, ఎందుకంటే వాళ్ళకిక పాపం మిగిలింది రేడియో ఒక్కటే గదండీ. అంటే వాళ్ళను బలహీనవర్గంగా భావించి అలా సహాయం చేస్తామన్న మాటండీ. అందులో కూడా కిక్‌బాక్లిచ్చే వాళ్ళనే ఎంకరేజ్ చేస్తామన్నమాట!"

"దేశనాయకులెవరయినా పరమపదించినప్పుడు ఏం ప్రోగ్రామ్స్ ఇస్తావు?" అడిగాడు మొదటి పెద్దమనిషి కాసేపు ఆలోచించి.

"గోవిందా! గొవిందా- వారం రోజులపాటు ఏడుపు మ్యూజిక్కే కదండీ, ఇంకా ప్రోగ్రామ్స్ ఏముంటాయ్ నా బొంద? ఉదయం డ్యూటీకి రాగానే 'కుయ్యో' మంటూ మొదలెట్టే టేప్ తగిలించి మనం బయటికి వెళ్ళి బోలెడన్ని సొంత పనులన్నీ చూసుకుని సాయంత్రం వచ్చి ఆ టేప్ తీసేస్తామన్న మాటండి."

ఇంకేం ప్రశ్న వేయాలా అని ఎస్.డి. ఆలోచించసాగాడు. ఈలోగా రెండో పెద్దమనిషి రకీమని అతిక్లిష్టమైన ప్రశ్న వదిలాడు.

"ఆ- మిస్టర్ శ్రోతేశ్వరరావ్, మనకు అతి ముఖ్యమైన పండుగలకు, జాతీయ సెవులకు ఏం ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేస్తావు?"

"వాటికి ప్రోగ్రామ్స్ అని పెద్దగా ఏమీ ఉండవండి. గాంధీజీ బర్త్‌డే ఉందనుకోండి. ఆ రోజు తెల్లారుజాము నుంచే గాంధీతాత మీద తెలుగు సినిమా పాటలు వేయడం స్టార్ట్ చేస్తామండి. మొట్టమొదటి పాట "భలే తాత మన బాపూజీ బాలల తాతా బాపూజీ" వేస్తామండి. ఆ తరువాత "గాంధి పుట్టిన దేశమా ఇది, నెహ్రూ కోరిన రాజ్యమా ఇది" పాటండి, ఆ తరువాత "గాంధీ పుట్టిన దేశం- రఘురాముడు ఏలిన రాజ్యం" పాట లాగిస్తామండి "గాంధీ మహాత్ముడు కలలుగన్న మరో ప్రపంచం" పాట ఆ తరువాత వేసేస్తాం, ఇలా వేసినవే వేస్తూ, మధ్య మధ్యలో "రఘుపతి రాఘవ రాజారాం" తగిలిస్తూ లాగించేస్తామండి.

ఇక కృష్ణ జయంతి రోజున మీకు తెలీదేంముందండీ! తెల్లారుతూనే హే కృష్ణా, ముకుందా, మురారీ పాటతో మొదలుపెట్టి కృష్ణ అన్నపదం పాటలో ఉంటేచాలు ఆ పాటలన్నీ మోతెక్కించేస్తాం.

ఇక రక్షాబంధన్ పండుగ రోజున "అన్నయ్య సన్నిధి అదే నాకు పెన్నిధి" పాటతో మొదలెట్టి మొత్తం సినిమాల్లోని అన్నా చెల్లెళ్ళ పాటలన్నీ లాగేంచేస్తాం.

"ఇక దీనావళి నాడు చీకటి వెలుగుల రంగేళీ! మన జీవితమే ఒక దీపావళి అనే పాటతో మొదలుపెట్టి అన్ని దీపావళి పాటలూ వేసేస్తాం!"

''ఇక శ్రీరామనవమికి ''రామ కథను వినరయ్యా''తో మొదలెట్టి తుప్పు వదిలించేస్తాం, ఇక నాగులచవితినాడు...."

ప్రశ్న అడిగినతని మొఖం పాలిపోయింది.

"చాలు మిష్టర్ శ్రోతేశ్వర్రావ్ చాలు, ప్లీజ్" అని బ్రతిమాలాడు.

శ్రోతేశ్వర్రవ్ ఆపేశాడు.

"ఆ! ఈ ప్రశ్నను సమాధానం చెప్పు చూద్దాం చాలా టఫ్ కొశ్చెన్! మన ప్రదానమంత్రి రేడియోలో మాట్లాడతానని కబురు చేసారనుకో ఏం చేస్తావ్?"

శ్రోతేశ్వర్రావ్ విరగబడి నవ్వాడు.

"భలేవారే సార్– ఇంతసేపు ఆలోచించి ఇంత చిన్న ప్రశ్న అడిగారేమిటి? ప్రధానమంత్రి గారుండే చోటికి మొత్తం రేడియో స్టేషన్ని తీసుకెళ్ళి వారు చెప్పే విషయాలన్నీ తుచ వప్పకుండా రికార్డ్ చేస్తామండి."

ఎన్.డి. ఆలోచనల్లోంచి ఠక్కున తేరకున్నాడు. మొఖనికీ, నుదుటికీర విపరీతంగ పట్టేసిన చెయటలు తుడుచుకున్నాడు.

"అదే రాష్ట్ర ముఖ్యమంత్రి అడిగితే?"

"అది ఆ ముఖ్యమంత్రి ఏ పార్టీకి చెందినవాడా అనే దాన్ని బట్టి వుంటుందండీ. ఉదాహరణకు మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్టీరామారావు రేడియోలో మాట్లాడాల నుకోండి! వీల్లేదు పొమ్మంటామండీ."

''ఇదిగో శ్రోతేశ్వర్రావు! మేము ముగ్గురం కలిసి ఆలోచించి ఇంకొక్క ప్రశ్న తయారుచేస్తాం. అంతవరకూ బయట కూర్చుంటే..."

"ఓ ఎన్నిరోజులు కూర్చోమన్నా కూర్చుంటానండీ. నా పేరే శ్రోతేశ్వర్రావు కదండీ, రేడియో స్టేషన్లో గడపడం కంటె నాకు కావలసిందింకేముందండీ?" అంటూ అతను బయటికి వెళ్ళిపోయాడు. మరుక్షణం ముగ్గురూ ఏ ప్రశ్న అడగాలా అన్న తర్జనభర్జనలో మునిగిపోయారు.

గంటసేపటి తర్వాత గానీ వాళ్ళక్కావలసిన కఠినమైన ప్రశ్న దొరకలేదు.దొరికిందే

తడవుగా శ్రోతేశ్వర్రావుని దబ్బున లోపలకి పిలిపించారు.

"మన రేడియో స్టేషన్‌కి సాధారణంగా పరమ చెత్త స్క్రిప్టులు వస్తాయి కదా వాటిల్లో చాలావరకు మనం ప్రసారం చేస్తాం. అసలేమాత్రం ప్రసార యోగ్యం కాని చెత్తను మనమేం చేస్తాం? చింపిపారేస్తామా? చెత్త బుట్టలో వేస్తామా?"

"రెండూ చేయమండీ. అలాంటి రచనల కోసమే యువవాణి ప్రసారాలు ప్రారంభించామన్న మాటండీ. అంచేత రేడియో స్టేషన్లో ప్రసారానికి పనికిరాని చెత్త అంటూ ఏమీ మిగలదండీ."

ముగ్గురి మొఖాలూ వాడిపోయినయ్.

ఇంక తాము చేయగలిగిందేమీలేదు. శ్రోతేశ్వర్రావ్‌కి ఉద్యోగం ఇవ్వక తప్పదు. ఈ ఉద్యోగానికి అన్నివిధాలా అతనికే అర్హత ఉంది.

"ఓకే మిస్టర్ శ్రోతేశ్వర్రావ్, ఈ ఉద్యోగాన్ని సంపాదించుకున్నావ్, కంగ్రాచ్యులేషన్స్" అన్నాడు స్టేషన్ డైరెక్టర్.

"థ్యాంక్యూ సర్!" వినయంగా అన్నాడు శ్రోతేశ్వర్రావ్.

"సరే ఇవన్నీ బాగానే ఉన్నాయ్. పర్సనల్‌గా ఇంకొక్క విషయం తెలుసుకోవాలని ఉందోయ్!" అన్నాడు ఎస్.డి.

"తప్పకుండా తెలుసుకోండి సార్."

"నీ పెరఫారమెన్స్, నీ ప్రోగ్రామ్స్ క్వాలిటీ పరమ ఘోరంగా ఉంటోందని స్టేషన్ డైరెక్టర్ మెమో ఇచ్చాడనుకో! అప్పుడేం చేస్తావ్?"

శ్రోతేశ్వర్రావ్ పొట్ట చేతితో పట్టుకుని టేబుల్ కింద నేలమీదపడి విరగబడి నవ్వాడు.

"అరె ఏమిటలా నవ్వుతావు?" ఆశ్చర్యంగా అడిగారందరూ కిందకు వంగి చూస్తూ.

"లేకపోతే ఏం ప్రశ్నసార్ అది? అలా జరగటం ఇంపాజిబుల్! నా పెర్ఫామెన్స్ ప్రోగ్రామ్స్ క్వాలిటీ చెత్తగా ఉండటమా? నెవర్!"

"అంటే రేడియోలో అన్నీ అద్భుతమయిన ప్రోగ్రామ్సే వుంటాయని నీ అభిప్రాయం! అంతేనా?"

"అయ్యో అదికాదు సార్! అదెలాగూ చెత్త క్వాలిటీయే, నేననేది అది కాదు. ఆ విషయం స్టేషన్ డైరెక్టర్ తెలుసుకోవడం గురించి! ఆయనకెలా తెలుస్తుంది ఆ విషయం?"

"అదేమిటి?ఎందుకు తెలీదు?"

"తెలుగు ఏరియాలో రేడియో స్టేషన్లకు స్టేషన్ డైరెక్టర్‌గా ఎప్పుడూ తెలుగు రానివాళ్ళనే వేస్తారు కదా– మరి వాళ్ళకిక ఈ పెరఫార్మెన్సులు, క్వాలిటీలు ఇంకేం తెలుస్తాయి సార్! శ్రోతలందరూ అరచి గీపెట్టినా అర్ధం కాదు. అంచేత ఇక ఆయన నాకు మెమో ఇచ్చే అవకాశమే లేదు."

"సరే ఇంక మీరు వెళ్ళవచ్చు" అన్నాడు స్టేషన్ డైరెక్టర్ ఒరియాలో (పొరపాటున),

శ్రోతేశ్వర్రావు వెళ్ళిపోగానే ఆయన ఫోన్ అందుకున్నాడు.

"హలో ఢిల్లీయేనా? హలో సార్ అయామ్ రియల్లీ సారీ! యెంత ప్రయత్నించినా మీ కాండిడేట్ శ్రీనివాసన్‌ని సెలక్టు చేయడం కుదర్లేదు. మరో అవకాశం వచ్చినప్పుడు తప్పక..."

"అవసరం లేదులెండి ఇక్కడే ఢిల్లీ రేడియో స్టేషనులో తెలుగు న్యూస్ రీడర్ వేకెన్సీ ఒకటి వచ్చింది- దానికి సెలెక్టు చేసేస్తాం అతనిని."

"అదేమిటండి? అతనికి తెలుగు అస్సలు రాదు కదా! మరి అలాంటి వ్యక్తి తెలుగు ఏరియా రేడియోస్టేషన్లలోనే ఉంటే బావుటుంది."

"ప్రస్తుతం అక్కడికంటే ఇక్కడ ఉంటే ఇంకా మంచిదిలెండి. రోజూ తెలుగున్యూస్ చదివితే- ఓ సంవత్సరంలో తెలుగు నేర్చుకోవచ్చు కదా."

"అఫ్‌కోర్స్ తెలుగు నేర్చుకోవాలనుకునే ఇతర భాషల వాళ్ళకి ఢిల్లీ తెలుగు న్యూస్ రీడర్ పోస్ట్ కంటె మరో గొప్ప అవకాశం దొరకదులెండి."

"అన్నట్లు చెప్పడం మరిచిపోయాను, మీ ట్రాన్స్‌ఫర్‌కి మినిస్టరు గారు వప్పుకోలేదు. 'రిగ్రెట్' అని రాశాడు ఇంతకుముందే- ఉంటా-"

స్టేషన్ డైరెక్టర్ చేతిలోనుంచి రిసీవర్ పడిపోయింది.

ఆయన టేబుల్ మీదున్న ట్రాన్సిస్టర్‌లో నుంచి 'అన్నయ్య సన్నిధీ అదే నాకు పెన్నిధీ... అన్న పాట హాయిగా వినబడుతోంది. ఆ రోజు రక్షాబంధన్ పండుగ.